సాక్షి సూర్యాపేట
శనివారం । 30 । డిసెంబర్ । 2023



చారిత్రక కట్టడాలను కాపాడాలి
చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. - 10లో



చింతపల్లి ఠాణాకు వాస్తు దోషం!
చింతపల్లి ఠాణాకు వాస్తు దోషం పట్టుకుందని అధికారులు తాజాగా ముందు భాగాన్ని కూల్చివేశారు. . - 10లో



'డబుల్' సర్కార్‌తోనే అభివృద్ధి
డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

రాయితీని సద్వినియోగం చేసుకోండి : ఎస్పీ

సూర్యాపేట క్రైం: వివిధ వాహనాలపై పోలీసులు విధించిన జరిమానాలకు సంబంధించి ఈ చలాన్ చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రాహుల్ హెగ్డే ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ ప్రక్రియ డిసెంబర్ 26వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90శాతం, ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, ట్యాక్సీలపై 60శాతం, భారీ వాహనాలపై 50శాతం రాయితీ ఉందని తెలిపారు. జిల్లాలో 25వ తేదీ వరకు 6,08,968 ఈ చలాన్ కేసులు పెండింగ్‌లో ఉండగా మూడు రోజులుగా 30,600 కేసులను ప్రజలు పరిష్కరించుకున్నారని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌కు సిద్ధంకండి

సూర్యాపేట టౌన్: సూర్యాపేటలో జనవరిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు విద్యార్థులు సిద్ధం కావాలని డీఈఓ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి 60మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డు మనక్ స్కీంకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్ల వీడియోలను జనవరి 1 నుంచి 18 వరకు ఇన్‌స్పైర్ మనక్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు డీఎస్ఓ ఎల్.దేవరాజ్‌ను సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య పథకాలను వినియోగించుకోవాలి



సంకల్ప యాత్రలో పాల్గొన్న డాక్టర్ కుమార్ సుందరం, అధికారులు

చిలుకూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరోగ్య సంక్షేమ పథకాలను ప్రజలంతా వినియోగించుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ కుమార్ సుందరం అన్నారు. కేంద్ర ఆరోగ్య పథకాలను గ్రామీణులకు వివరించేందుకే చేపట్టిన వికసిత భారతం సంకల్ప యాత్రను శుక్రవారం చిలుకూరు మండలం దూదియాతండాకు చేరిన సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వైద్యరంగానికి అందజేస్తున్న నిధులు, చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ అధికారి రవికుమార్, జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.కిరణ్‌కుమార్, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ నవ్య, సీహెచ్ఓ వినోద్, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైతన్య, సిబ్బంది

నేరేడుచర్ల: విద్యార్థులు సామాజిక మాద్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ మాధవంశెట్టి చైతన్య అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ మీడియాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సామాజిక మాద్యమాలతో జరిగే అనర్థాలతోపాటు పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం భవిష్యత్ ప్రణాళిక, పోక్సో యాక్ట్, బాల్య వివాహాల నిర్మూలన, లింగ సమానత్వం, రుతుక్రమ శుభ్రత అంశాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు, సాధికారిత మిషన్ సభ్యులు కుక్కడపు వినోద్, జూలూరి రేవతి, ఉపాధ్యాయులు మాతంగి సైదులు, కట్ట వెంకటేశ్వర్‌రావు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, భవాని, రవికుమార్, కృష్ణ ప్రసాద్, అన్నపూర్ణ, నగేష్, లాల్‌సహాయఖఖ్, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 8నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

తుంగతుర్తి: వచ్చే నెల జనవరి 8వ తేదీ నుంచి ఎస్సారెస్పీ కాలువలకు గోదావరి నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్సారెస్పీ ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడారు. ఈ నీటిని మార్చి 30వ తేదీ వరకు విడుదల చేస్తామని పేర్కొన్నారు. రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.

● అంతటా క్యూలైన్లే..



గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఈకేవైసీ కోసం శుక్రవారం సూర్యాపేటలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూకట్టిన మహిళలు



జిల్లా కేంద్రంలోని ఇందిరా పార్కు వద్ద మీ సేవ కేంద్రంలో ఆధార్ అప్‌డేషన్ చేయించుకుంటున్న జనం

ఒక్కటీ పూర్తికాలేదు!



కొనసాగుతున్న ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్టు పనులు (ఫైల్)

- శంకుస్థాపనలే తప్ప.. పనులు ఎక్కడివి అక్కడే
- ముందుకు కదలని ఎత్తిపోతలు, రిజర్వాయర్ల నిర్మాణం
- పరిహారం కోసం నిర్వాసితుల ఎదురుచూపులు
- 2023లో సాగునీటి ప్రాజెక్టులపై నీలిమేఘాలు

రివైండ్ 2023

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంలా మారింది. 2023 సంవత్సరంలో ప్రాజెక్టుల్లో పెద్దగా పురోగతి లేకుండాపోయింది. ప్రధానమైన ఎస్ఎల్‌బీసీ టన్నెల్, నెల్లికల్ తదితర ప్రాజెక్టులో పెండింగ్‌లోనే పడ్డాయి. డిండికి నీటిని ఎక్కడి నుంచి తెస్తారన్న విషయాన్ని గత ప్రభుత్వం తేల్చలేకపోయింది. దానికి అనుసంధానంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ల పనులు ఆగిపోయాయి. పరిహారం కోసం ప్రజలకు ఎదురుచూపులు తప్పలేదు. ఆందోళనలు చేసినా పట్టించుకునే వారు లేకుండాపోయారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో లిఫ్ట్ నిర్వహణ అధ్వానంగా తయారైంది. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సరిపడా నిధులు ఇవ్వకపోవడంతో చివరి దశకు చేరుకున్నా పెండింగ్‌లోనే ఉంది.

ముందుకు సాగని ఎస్ఎల్‌బీసీ సొరంగం

నల్లగొండ జిల్లాలోని 3.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 గ్రామాలకు తాగునీరు అందించేందుకు 2007లో ప్రారంభించిన శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టు కావడంతో గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు పెద్దగా దృష్టి పెట్టలేదు. ప్రాజెక్టును మంజూరు చేసిన మొదటి ఏడేళ్లలో అప్పటి ప్రభుత్వం వేగంగా పనులను చేపట్టింది. 43.930 కిలోమీటర్ల టన్నెల్‌లో 2014 మే వరకు 23 కిలోమీటర్లు సొరంగం తవ్వగా.. ఆ తరువాత నుంచి తొమ్మిదిన్నరేళ్లలో 11.370 కిలోమీటర్ల తవ్వకమే పూర్తయింది. ఇంకా 9.56 కిలోమీటర్ల సొరంగం తవ్వాల్సి ఉంది. టన్నెల్ తవ్వకంలో ప్రధానమైన టీబీఎంలో ఏర్పడిన సాంకేతిక లోపాలు, విద్యుత్ ఛార్జీలు, కార్మికుల బకాయిలు తదితర సమస్యతో గత ఏప్రిల్ నుంచే పనులు ఆగిపోయాయి.

నీటి కేటాయింపును పట్టించుకోని ప్రభుత్వం

ఫ్లోరైడ్ పీడిత నియోజకవర్గాలైన మునుగోడు, దేవరకొండ, నల్లగొండ, నకిరేకల్‌లోని దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగునీరందించే పాలమూరు – రంగారెడ్డి అంతర్భాగంగా చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకానికి ఎక్కడి నుంచి నీటిని తీసుకోవాలనే దానిని ప్రభుత్వం పట్టించుకోలేదు. ఒక్కోసారి ఒక్కో చోట నుంచి అంటూ తీవ్ర జాప్యం చేసింది. దీంతో దానికింద కొత్తగా నిర్మిస్తున్న సింగరాజుపల్లి, గొట్టిముక్కల, కిష్టరాయినిపల్లి, శివన్నగూడెం, పెండిపాకల రిజర్వాయర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

లిఫ్టుల్లో కానరాని కదలిక

సాగర్ ఉప ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో నెల్లికల్‌తో పాటు మరో 14 ఎత్తిపోతల పథకాలకు అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసి నిధులను మంజూరు చేశారు. అయితే వాటి పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. 2021 ఫిబ్రవరిలో పనులు ప్రారంభమైనా ఇప్పటి వరకు సగం కూడా కాలేదు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెం మండలం పాత వెల్లటూరు గ్రామం వద్ద కృష్ణానదిపై ఎంబీసీ (ముక్త్యాల బ్రాంచ్ కెనాల్) లిఫ్టును నిర్మించాలని గత ప్రభుత్వం సంకల్పించింది. ఈ లిఫ్ట్ కింద ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని దాదాపు 53 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ప్రభుత్వం రూ.1,450 కోట్లతో పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ లిఫ్టుకు సంబంధించిన పైపుల తయారి పనులు మాత్రమే జరుగుతున్నాయి. దాదాపు తొమ్మిదిన్నర కిలోమీటర్ల పైపులు తయారయ్యాయి. ఎర్త్‌వర్క్, ఇతర పనులేవీ ప్రారంభం కాలేదు. పైపులైన్ కోసం 98 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇచ్చేందుకు రైతులు అంగీకరించడం లేదు. పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ లిఫ్ట్ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. చింతలపాలెం మండలంలోని కిష్టపట్టి గ్రామాల్లోని 3,200 ఎకరాల ఆయకట్టుకు నీరందించే నక్కగూడెం లిఫ్ట్ నడవడం లేదు. పైపుల లీకేజీ, మోటార్ల మరమ్మతు కారణంగా ఈ లిఫ్ట్ మూలన పడింది. అదే మండంలోని పాత వెల్లటూరు వద్ద నిర్మించిన శివగంగా లిఫ్ట్ ద్వారా దాదాపు 1,800 ఎకరాల ఆయకట్టు నీరు అందించాల్సి ఉంది. ఈ లిఫ్టుకు తరుచూ మరమ్మతు వస్తుండడంతో నీటి విడుదల సక్రమంగా సాగడం లేదు.

మూతపడిన ఎల్‌-34 పథకం



నడిగూడెం సమీపంలో మూతపడిన ఎల్‌-34 ఎత్తిపోతల పథకం

నడిగూడెం మండల కేంద్రం సమీపాన ఉన్న సాగర్ ఎడమ కాల్వపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎల్–34 ఎత్తిపోతల పథకం మూతపడింది. మోటార్లకు మరమ్మతులు చేయకపోవడం, పైపులైన్ దెబ్బతినడంతో పాటు, మేజర్, మైనర్ కాల్వలు శిథిలావస్థకు చేరాయి. దీనిని పట్టించుకున్న వారే లేకుండా పోయారు.

ప్రజా పాలనకు స్పందన బాగుంది

- దరఖాస్తుదారులకు తప్పకుండా రశీదు ఇవ్వాలి
- ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఆర్‌వి.కర్ణన్



మాట్లాడుతున్న నోడల్ అధికారి కర్ణన్, చిత్రంలో మాజీ మంత్రి ఆర్డీఆర్, కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన బాగుందని, దరఖాస్తులు స్వీకరించిన అధికారులు తప్పకుండా రశీదు ఇవ్వాలని రాష్ట్ర వైద్యశాఖ డైరెక్టర్, ప్రజా పాలన ఉమ్మడి నల్లగొండ జిల్లా నోడల్ అధికారి ఆర్‌వి.కర్ణన్ అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని 19 వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన వార్డు సభకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావుతో కలిసి హాజరయ్యారు. జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల ప్రజలు ఐదు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డులు లేకపోయినా, కొత్తగా పెళ్లి అయిన ఫ్యామిలీలు ఆందోళన చెందొద్దని, సమయానికి అందుబాటులో లేకుంటే మరుసటి రోజు వచ్చి పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి దరఖాస్తు అందజేసి రశీదులు తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. ప్రజలు హెల్ప్ డెస్క్‌లను వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రజాపాలన నిర్వహిస్తామని, దరఖాస్తులను ఉచితంగా అందజేస్తున్నామని, ప్రజలు ఎక్కడా జిరాక్స్ ప్రతులను కొనుగోలు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, నియోజక ప్రత్యేక అధికారి జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, వార్డు కౌన్సిలర్ సుంకరి అరుణ పాల్గొన్నారు.



సూర్యాపేటలోని 19వ వార్డులో దరఖాస్తులు అందజేస్తున్న పట్టణ వాసులు

ఎమ్మెల్సీ ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల

- ఓటరు నమోదుకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు గడువు
- ఏప్రిల్ 4న తుది జాబితా ప్రకటన

నల్లగొండ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆరు నెలల్లోపు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అందు కోసం ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 30వ తేదీన ఓటరు జాబితాకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేస్తారు. 2024 ఫిబ్రవరి 6వ తేదీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 24న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. ఆ రోజు నుంచి మరలా మార్చి 14వ తేదీ వరకు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. మార్చి 29న అభ్యంతరాలను పరిష్కరించి 2024 ఏప్రిల్ 4వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందించాలి

సూర్యాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. శుక్రవారం సూర్యాపేటలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించిన బీఆర్ఎస్ పార్టీని ఓడించాలనే ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా గ్రామ పంచాయతీలు గెలిచేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు ఏకలక్ష్మి, రాష్ట్ర నాయకులు కోట రమేష్, కట్ట నరసింహ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టపల్లి సైదులు, మేరదమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

రెండో రోజు 35,109 దరఖాస్తులు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజాపాలన కార్యక్రమంలో రెండో రోజు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి 35,109 దరఖాస్తులు స్వీకరించామని, ఇందులో 85 గ్రామ పంచాయతీల నుంచి 27,695 అలాగే 21 మున్సిపల్ వార్డుల్లో 7,414 ఉన్నాయని కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదులు అందించాలన్నారు. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

అధికారులు సంయమనం పాటించాలి

మునగాల(కోదాడ): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణలో అధికార యంత్రాంగం సంయమనం పాటించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. మునగాల మండలం ఆకుపాములలో రెండో రోజు శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు.



ఆకుపాములలో దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్

కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సూర్యనారాయణ, డీపీఆర్ఓ రమేష్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీపీ ఎలక బిందు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఎంఆర్ఐ రాధారెడ్డి, సర్పంచ్ కేసగాని వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

నేలమర్రిలో తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

మండలంలోని నేలమర్రిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక ఆకస్మిక తనిఖీ చేశారు. దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు.

నిర్ణీత సమయానికి వ్యయ పరిశీలన జరగాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): వివిధ పార్టీలు, పోటీ చేసిన అభ్యర్థులు సాధారణ ఎన్నికల్లో చేసిన ఖర్చుల వివరాలను నిర్దేశించిన సమయానికి వ్యయ పరిశీలన చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఓలను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సూర్యాపేట, తుంగతుర్తి వ్యయ పరిశీలకుడు విజయన్, కోదాడ, హుజూర్‌నగర్ వ్యయ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటకు సంబంధించి స్థానిక మార్కెట్ యార్డులో జనవరి 1, 2 తేదీల్లో బిల్లుల పరిశీలన జరుగుతుందన్నారు. తుంగతుర్తికి సంబంధించి ఈనెల 30, 31న తుంగతుర్తి తహసీల్దార్ కార్యాలయంలో, కోదాడకు సంబంధించి ఈ నెల 30 నుంచి జనవరి 2 వరకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో అలాగే హుజూర్‌నగర్‌లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తహసీల్దార్ కార్యాలయంలో బిల్లుల పరిశీలన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీఓలు సూర్యనారాయణ, జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాంకేతిక పరిజ్ఞానం పెంచేలా..

- ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు
- విద్యార్థుల సంఖ్యను బట్టి మంజూరు
- ఎమ్మార్సీ కార్యాలయాలకు కూడా..
- త్వరలోనే అమర్చేందుకు విద్యాశాఖ సన్నాహాలు
- బోధకుల నియామకంపై సందిగ్ధం

నాగారం: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేదుకు విద్యాశాఖ అడుగులు వేస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్య అందించేందుకు సమగ్రశిక్షా అభియాన్ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలలు, మండల రిసోర్సు కేంద్రాలకు (ఎమ్మార్సీలకు) ప్రత్యేకంగా కంప్యూటర్లు మంజూరు చేసింది. వీటిని ఇప్పటికే జిల్లా కేంద్రాల నుంచి మండలాల్లోని ఎమ్మార్సీలకు సరఫరా చేశారు. త్వరలోనే పాఠశాలలకు చేరనున్నాయి. కంప్యూటర్‌తో పాటు ప్రింటర్లు, రెండు ఆఫీస్ సాఫ్ట్‌వేర్, స్విచ్ బోర్డులు, కేబుల్ వైర్, జాక్ ప్యానెల్ సామగ్రిని అందించనున్నారు. వీటిని త్వరలోనే ఎమ్మార్సీ కార్యాలయాల్లో, మంజూరైన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమర్చనున్నారు. కాగా జిల్లాలోని 18 ఎమ్మార్సీలకు 108, అలాగే 72 పాఠశాలలకు 482 కంప్యూటర్లు మంజూరయ్యాయి.

పాత మండలాలకే..

జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉండగా వీటిలో 18 పాత మండాలు, 5 కొత్త మండలాలు ఉన్నాయి. కాగా పాత మండలాల ఎమ్మార్సీలకు మాత్రమే ఈ కంప్యూటర్లను సరఫరా చేశారు. కొత్త మండలాల్లో ఇంకా ఎంఈఓ, సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుతం కార్యకలాపాలు పాత ఎమ్మార్సీలతోనే నిర్వహిస్తున్నారు. వీటిలో పాతవి రెండు, మూడు కంప్యూటర్లు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో విద్యా శాఖకు సంబంధించిన వివరాలు నమోదు చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పనుల్లో జాప్యం జరుగుతుంది. దీనిని గుర్తించిన విద్యా శాఖ ప్రతి ఎమ్మార్సీకి ఆరు కంప్యూటర్ల చొప్పున మంజూరు చేసింది. వీటి ఏర్పాటు వల్ల సీఆర్పీలు వారి పరిధిలోనే సర్వే వివరాలను నమోదు చేసుకునే వీలుంది.



పెన్‌పహాడ్ ఎమ్మార్సీకి చేరిన కంప్యూటర్లను పరిశీలిస్తున్న అధికారులు

కంప్యూటర్ల మంజూరు వివరాలు

	ఎంపికైనవి	మంజూరైనవి
ఎమ్మార్సీలు	18	108
పాఠశాలలు	72	482

సాంకేతిక విద్యలో ముందడుగు



"జిల్లాలో ఉన్న ఎమ్మార్సీలతో పాటు ఎంపిక చేసిన పాఠశాలలకు కంప్యూటర్లు వచ్చాయి. ఇప్పటికే ఎమ్మార్సీలకు సరఫరా చేశాం. పాఠశాలలకు కూడా పంపిణీ చేస్తున్నాం. పాఠశాలల్లో కంప్యూటర్ విద్య ద్వారా విద్యార్థులు సాంకేతిక విద్యపై పట్టుసాధిస్తారు. త్వరలోనే ఎమ్మార్సీల్లో, పాఠశాలల్లో కంప్యూటర్లను ఏర్పాటు చేయిస్తాం.

– కె.శ్రవణ్‌కుమార్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్, సూర్యాపేట

కంప్యూటర్ విద్య బోధించేవారు లేక మూలకు..

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలనే లక్ష్యంతో గతంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఐసీటీ (ఇన్ఫర్‌మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) ప్రాజెక్టు కింది సక్సెస్ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టింది. 2014–2015లో ఒప్పంద గడువు తీరడంతో ఒప్పద సంస్థ వారు బోధకులను తొలగించారు. దీంతో సక్సెస్ పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు మూలనపడ్డాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షగా మారింది. ప్రస్తుతం విద్యా శాఖ విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు 100లోపు విద్యార్థులు ఉండే పాఠశాలలకు ఐదు కంప్యూటర్లు, 101–200 ఉంటే 8 కంప్యూటర్లు, 201 నుంచి ఆపై విద్యార్థులు ఉన్న పాఠశాలలకు 10 కంప్యూటర్ల చొప్పున అందించాలని నిర్ణయించింది. దీంట్లో భాగంగా ఇటీవల కంప్యూటర్లను ఎమ్మార్సీలకు చేర్చారు. ప్రస్తున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలకూ సరఫరా చేస్తున్నారు. కానీ, కంప్యూటర్ బోధించే టీచర్లను నియమిస్తేనే పేద విద్యార్థులకు సాంకేతిక విద్య చేరువకానుందనే, లేదంటే కంప్యూటర్లు ఇచ్చినా నిరుపయోగమే అవుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలి


కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

నాగారం: చారిత్రక కట్ట డాలను కాపాడు కోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఫణిగిరి రామాలయం వద్ద ఉన్న రెండంతస్తుల రాముల వారి కల్యాణ మండపాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆలయ ఆవరణలో ఉన్న రెండంతస్తుల మండపం క్రీ.శ. 13వ శతాబ్దికి చెందిన కాకతీయ వాస్తుశైలికి నిదర్శనమన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

మాడుగులపల్లి : అనారోగ్య సమస్యలతో ఉరేసుకుని యువతి.. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామానికి చెందిన కొండా వెంకన్నకు ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. పెద్ద కుమార్తెకు వివాహం కాగా రెండో కుమార్తె రాజేశ్వరి (18) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటోంది. కొంతకాలంగా ఆమె కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భరించలేని కడుపునొప్పి రావడంతో తీవ్ర గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వ్యవసాయ పనులకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి తిరిగి రాగా అప్పటికే రాజేశ్వరి విగతజీవురాలైంది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి మిర్యాలగూడ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

మిర్యాలగూడ మండలం గోగువారిగూడేనికి చెందిన సాధినేని గోవిందరావు (32)కు ఏడాది క్రితం మిర్యాలగూడలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన శ్రీవిద్యతో వివాహం జరిగింది. నాటి నుంచి అతడు అత్తవారింటి వద్దే ఉంటున్నాడు. కొంతకాలంగా గోవిందరావుకు భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతున్నాయి. గురువారం గోవిందరావు ను భార్య, అత్తామామ, బావమరిది దూషించి కర్రలతో దాడి చేశారు. మనోవేదనకు గురైన గోవిందరావు పెద్దదేవులపల్లి శివారులో పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు సైదారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

చింతపల్లి ఠాణాకు వాస్తు దోషం!

- వాస్తు దోషం పేరిట పోలీస్‌స్టేషన్ ముందు భాగం కూల్చివేత
- ఎస్‌ఐలకు కలిసి రాని చింతపల్లి పోస్టింగ్
- పది నెలల వ్యవధిలో పదకొండు మంది బదిలీ


చింతపల్లి పోలీస్‌స్టేషన్ ముందు ప్రహరీని కూల్చి చదును చేస్తున్న జేసీబీ

చింతపల్లి : నల్లగొండ జిల్లాలోని చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఎస్‌ఐలు పోటీ పడుతుంటారు. హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ఉన్న చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు అంత క్రేజ్ ఏర్పడింది. అంతా శుభం అనుకొని డ్యూటీలో జాయిన్ అయిన ఎస్‌ఐలు కొన్ని నెలలకే అనూహ్యంగా వివాదాలతో బదిలీ అవుతున్నారు. ఇలా ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. పది నెలల వ్యవధిలో పదకొండు మంది ఎస్‌ఐలు వేర్వేరు కారణాలతో బదిలీ అయ్యారు. దీంతో చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు వాస్తు దోషం పట్టుకుందని భావించిన అధికారులు.. తాజాగా స్టేషన్ ముందు భాగాన్ని కూల్చివేశారు.

క్లీన్‌చిట్‌తో వచ్చి.. వివాదాలతో..

చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐగా పని చేసేందుకు ఎక్కువ సంఖ్యలో ఆసక్తి కనబరుస్తుంటారు. ఈ క్రమంలో క్లీన్ చిట్‌తో స్టేషన్ ఎస్‌ఐగా వచ్చిన పలువురు అనుకోకుండా పలు కేసుల్లో జోక్యం చేసుకోవడం, భూ తగాదాల్లో తలదూర్చడం వంటి కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పని చేసిన పలువురు ఎస్‌ఐలు వివాదాలతో బదిలీ అవుతున్నారు.

వాస్తు దోషం ఎఫెక్ట్

చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన పలువురు ఎస్‌ఐలు వివాదాలతో బదిలీ అవుతుండడంతో ఇక్కడి స్టేషన్‌కు వాస్తు దోషం భయం పట్టుకుంది. ఈ క్రమంలో తాజాగా శుక్రవారం చింతపల్లి పోలీస్ స్టేషన్‌లోని ముందు భాగాన్ని కూల్చిన అధికారులు వాస్తు దోషాన్ని సరిచేసే పనిలో ఉండడం గమనార్హం. ఏదేమైనా చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు రావాలనుకునే ఎస్‌ఐలకు వరుసపెట్టి చోటు చేసుకుంటున్న ఘటనలు గుబులు పుట్టిస్తున్నాయి.

ఇదీ.. మా కుటుంబం


దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్‌వి కర్ణన్, సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ ప్రియాంక భార్య భర్తలు కాగా... విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన తన భార్య, పిల్లలు కలిసి వస్తున్న దృశ్యాన్ని డీపీఆర్‌ఓ రమేష్ ఫొటో తీస్తుండగా.. సాక్షి క్లిక్ మనిపించింది.

ఈజీ మనీ కోసం డ్రగ్స్ దందా

- జల్సాలకు అలవాటు పడి మత్తు పదార్థాల రవాణా
- గోవానుంచి హైదరాబాద్‌కు సరఫరా
- ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రంగస్వామి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ రూరల్: జల్సాలకు అలవాటు పడ్డారు.. సునాయాసంగా సంపాదించాలనుకున్నారు.. ఇందుకోసం డ్రగ్స్ దందాను ఎంచుకున్నారు... గోవానుంచి హైదరాబాద్‌కు మత్తు పదార్థాలు సరఫరా చేస్తూ గురువారం రాత్రి పట్టుబడ్డారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఏసీపీ రంగస్వామి వివరాలు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ప్రియాంకరెడ్డి అలియాస్ ప్రియ హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉంటూ ఆర్కిటెక్చర్‌గా పనిచేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన శ్రీతేజ మాదాపూర్‌లో ఉంటూ టెక్ మహీంద్రా కంపెనీలో పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడిన ప్రియాంకరెడ్డి, శ్రీతేజ సునాయసంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకు డ్రగ్స్ దందాను ఎంచుకుని, తెలిసిన వారికి సరఫరా చేస్తున్నారు. గోవాలో ఉంటున్న శివ, భరత్‌కుమార్ సాయంతో గోవాలోని అరంబోల్‌లో ఉంటున్న రష్యాకు చెందిన అణ అనే మహిళ వద్ద డ్రగ్స్ (ఎండీఎంఏ)ను తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. ఇందుకు హైదరాబాద్‌కు చెందిన దినేశ్, గిరీష్, అఖిల్‌ను ఏజెంట్లుగా పెట్టుకున్నారు. నూతన సంవత్సర వేడుకలకోసం ఈ నెల 28న గోవానుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో శంషాబాద్ డీసీపీ ఆదేశాల మేరకు ఎస్‌ఐ దేవకి ఆధ్వర్యంలో ఎస్‌ఓటీ పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలను చేపట్టారు. ప్రియాంక, శ్రీతేజ నుంచి రూ.1లక్ష విలువచేసే 11గ్రాముల డ్రగ్స్‌ను పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని డ్రగ్స్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించి డ్రగ్స్ ఎక్కడ తీసుకున్నారు, ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారనే వివరాలను రాబట్టారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి రష్యా మహిళ అణతో పాటుగా వీరికి సహకరించిన శివ, భరత్‌కుమార్, డ్రగ్స్ తీసుకున్న దినేష్, గిరీష్, అఖిల్, దినేష్ పరారీలో ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కేసు విచారణ అనంతరం నిందితులు ప్రియాంక, శ్రీతేజను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు. డ్రగ్స్‌ను తరలించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్‌ను ముఠాను పట్టుకున్న సీఐ ప్రతాప్‌లింగం, ఎస్‌ఐ దేవకి, ఎస్‌ఓటీ ఎస్‌ఐలు రమణారెడ్డి, రాజశేఖర్, పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో డీఐ రాంరెడ్డి పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ వీధుల్లో భక్తుల మధ్య సేవను ఊరేగించారు. ఆండాళ్ అమ్మవారిని ఊరేగిస్తున్న సమయంలో మహిళ భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవోత్సవాన్ని చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాథ స్వరాన్ని వినిపించారు. స్వామి వారికి ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య కైంకర్యాలు కొనసాగాయి.

డ్రెయినేజీలో పసికందు మృతదేహం

- నాలుగు రోజుల క్రితమే మృతిచెందినట్లు ఆనవాళ్లు
- సూర్యాపేట జిల్లాలో అమానవీయ ఘటన

తిరుమలగిరి (తుంగతుర్తి) : పేగు బంధం డ్రెయినేజీ పాలైంది. అప్పుడే పుట్టిన, కనీసం బొడ్డుపేగు కూడా కత్తిరించని ఓ ఆడ శిశువు మృతదేహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు డ్రెయినేజీ(మోరీ)లో పడవేశారు. సూర్యాపేట జిల్లాలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ అమానవీయ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి పట్టణంలోని ఊర చెరువు సమీపంలో గల కాల్వలో నావజాత శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ వార్త పట్టణంలో దావాహనంలా వ్యాపించడంతో మున్సిపల్ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పసికందు మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. దుర్వాసన వస్తుండడంతో శిశువు మృతదేహాన్ని చెరువు సమీపంలోనే మున్సిపల్ సిబ్బంది ఖననం చేశారు. నవమాసాలు మోసి జన్మనిచ్చిన శిశువును ఆ తల్లి ఈ స్థితిలో ఎందుకు వదిలించుకోవాల్సి వచ్చిందో, అందుకు గల కారణాలు ఏమిటోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడపాలి

రాజాపేట : సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడపాలని పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజాపేట మండలంలోని కొండ్రెడ్డిచెర్వు, పుట్టగూడేనికి చెందిన విద్యార్థులు శుక్రవారం మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. పుట్టగూడెం, కొండ్రెడ్డిచెర్వు గ్రామాలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థుల వరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుకునేందుకు నిత్యం వస్తూ వెళ్తుంటారు. కాగా శుక్రవారం సాయంత్రం 6గంటలైనా బస్సు రాకంపోవడంతో రాస్తారోకో నిర్వహించారు. నిత్యం సాయంకాలం పాఠశాల సమయం 5వరకు రావాల్సిన యాదగిరిగుట్ట డిపోకు చెందిన బస్సు రాత్రి 7గంటలైనా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు ఆలస్యం కావడంతో అబ్బాయిలు ఇతర వాహనాలతో వారి గ్రామాలకు వెళ్లిపోవడంతో అమ్మాయిలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సకాలంలో బస్సు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. రాత్రి 7గంటలకు బస్సు రావడంతో విద్యార్థులు రాస్తారోకో విరమించారు.

రూ.100 ఇస్తేనే ఆన్‌లైన్‌లో పంట వివరాల నమోదు

- రైతుల నుంచి శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ సిబ్బంది వసూళ్లు
- అక్రమ వసూలును సమర్థించిన మార్కెట్ కార్యదర్శి
- వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న మార్కెట్ కార్యదర్శి వాయిస్ రికార్డులు

శాలిగౌరారం: ఆన్‌లైన్‌లో పంట సాగు, దిగుబడి వివరాల నమోదుకు శాలిగౌరారం మార్కెట్ కార్యాలయ సిబ్బంది ఒక్కో రైతు నుంచి ముక్కుపిండి రూ.100 వసూలు చేశారు. శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు, మాధారంకలాన్ గ్రామాలతో పాటూ మరికొన్ని గ్రామాలకు చెందిన పత్తిరైతులు తాము పండించిన పత్తిని మాధారంకలాన్ పరిధిలో గల టీఆర్ఆర్ కాటన్ మిల్లులోని సీసీఐ కేంద్రంలో అమ్ముకునేందుకు శుక్రవారం వెళ్లారు. పత్తిపంట సాగు, దిగుబడుల వివరాలు ఆన్‌లైన్‌లో రైతులు నమోదు చేసుకోవలసి ఉంటుంది. ఎక్కువ మంది కౌలు రైతులు కావడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేదు. పత్తిని సీసీఐలో అమ్ముకోవడానికి ఆన్‌లైన్ నమోదు సమస్య ఏర్పడింది.

మార్కెట్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా..

పంటల సాగు, దిగుబడులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించేందుకు ఆయా గ్రామాలకు చెందిన 30మంది రైతులు శాలిగౌరారం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి వచ్చారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మార్కెట్ సిబ్బందిని కోరగా రూ.100 ఇస్తేనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని డిమాండ్ చేశారు. దీంతో రైతులు ఇదేమిటని సిబ్బందిని ప్రశ్నించగా అంతేనంటూ సమాధానమిచ్చారు. దీంతో ఓ రైతు విషయాన్ని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ దృష్టికి ఫోన్‌లో తీసుకెళ్లగా మార్కెట్ కార్యదర్శి సైతం మాకు ఖర్చులు ఉంటాయని, జీతాలు ఇవ్వాలని, ఛాయ్ బిస్కట్ల కోసం ఇవ్వాల్సిందేనన్నారు. దీంతో ఆ రైతు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పగా నీ ఇష్టమున్నచోట చెప్పుకోమంటూ ఆ అధికారి సమాధానం ఇచ్చారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో ఒక్కొక్కరూ రూ.100 చేతిలో పెట్టి ఆన్‌లైన్ నమోదు చేసుకొని వెళ్లారు. అక్రమ వసూలు గురించి రైతు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వాట్సాప్ గ్రూపులలో చక్కర్లు కొడుతుండటంతో అధికారి అడ్డగోలు వ్యవహారంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్‌తో ఫోన్‌లో మాట్లాడగా తనకు ఏ రైతు ఫోన్ చేయలేదని, నేను ఆన్‌లైన్ నమోదుకు రూ.100 ఇవ్వాలని చెప్పలేదన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

కొండమల్లేపల్లి : గంజాయి విక్రయిస్తున్నారన్న అనుమానంతో నలుగురిని కొండమల్లేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. స్థానిక బస్టాండు వద్ద గల ఓ పాన్ డబ్బాలో గంజాయి కొనుగోలు చేసినట్లు సదరు యువకుడు పోలీసులతో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే నిఘా పెట్టిన పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టి మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. వారి వద్ద నుంచి సుమారు రూ.2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని సమగ్ర విచారణ జరుపుతున్నట్లు సమాచారం

అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం

యాదాద్రి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భూదాన్‌పోచంపల్లి : ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని శివారెడ్డిగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఐదు గ్యారంటీ స్కీమ్‌ల దరఖాస్తులను స్వీకరిస్తున్నామని చెప్పారు. ఎవరైనా దరఖాస్తులు అందించేందుకు రాలేకపోతే ఆందోళన చెందవల్సిన అవసరంలేదని అన్నారు. జనవరి 6వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా దరఖాస్తులను నింపలేని నిరక్షరాస్యుల కోసం హెల్ప్‌డెస్కులను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్, తహసిల్దార్ వీరాబాయి, సర్పంచ్ పీసర్ల మంజుల మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ బొక్క అమృతధర్మారెడ్డి, ఉపసర్పంచ్ నారి రాజేందర్, ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, శైలజ, పీఆర్ ఏఈ వెంకటేశం, నాయకులు వారాల రాంచంద్రారెడ్డి, సరసాని నర్సిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

నల్లగొండ టూటౌన్: బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే అభివృద్ధి సంక్షేమం పరుగులు పెడుతాయన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండలో బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల పార్టీ అగ్రనేతలు ఎంపీ ఎన్నికల్లో గెలుపుపై దిశా నిర్దేశం చేశారని, దాని ప్రకారంగా పార్టీ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నామని ఆయన చెప్పారు. బీజేపీతోనే దేశ భద్రత సంక్షేమం అభివృద్ధి సాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 10 ఎంపీ స్థానాలతో పాటు 30 శాతం ఓట్లు సాధించే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గెలిచిందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీది ముగిసిన చరిత్ర అని, కాంగ్రెస్ మునగబోయేదన్నారు. ఉచిత హామీల పేరిట ఎక్కువ కాలం ప్రజలను మోసం చేయలేరన్నారు. అనంతరం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సాధించిన ఓట్లపై సమీక్ష నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తామని అందుకు తనకు ప్రణాళికలతో ముందుకు పోవాలని సూచించారు. వికసిత్ సంకల్ప యాత్ర దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, భాగ్యరెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, శ్రీదేవిరెడ్డి, వర్షిత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బండారు ప్రసాద్, నివేదితారెడ్డి, రవికుమార్, చక్రవర్తి, లాలునాయక్, శ్రీనివాసరావు, లింగస్వామి, రవిగౌడ్, భాష పాల్గొన్నారు.

రైతు ప్రాణం తీసిన స్టార్టర్ వైరు

నేరేడుచర్ల : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. నేరేడుచర్ల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన గజానబోయిన సైదులు(39) శుక్రవారం మండలంలోని కల్లూరు గ్రామ సమీపంలో గల పొలంలో నాటు వేయించేందుకు వెళ్లాడు. పొలం వద్ద ఉన్న విద్యుత్ మోటారు స్టార్టర్ వైరు ప్రమాదవశాత్తు సైదులుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్ల లున్నారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

దాడి కేసులో పలువురి అరెస్ట్

నడిగూడెం : దాడి కేసులో పలువురిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నడిగూడేనికి చెందిన గుంజ యలయ్య, గుంజ మురళి, గుంజ అచ్చమ్మలపై ఈ నెల 21న పలువురు దాడి చేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన మేళ్లచెర్వు, ఖమ్మం జిల్లాకు చెందిన దేవరంగుల వీరబాబు, వేముల వెంకటేశ్వర్లు, మణి కుమార్, గోపి, కొండలును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు.

స్వపక్ష నాయకుడిపై శ్రీధర్‌రెడ్డి దాడి

- బీజేపీ త్రిపురారం మండల అధ్యక్షుడిపై చేయిచేసుకున్న జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి
- అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు కాజేశారని మండల కమిటీ సమావేశంలో దాడి

త్రిపురారం : బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి వివాదంలో చిక్కుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఖర్చుకు ఇచ్చిన డబ్బులు స్వాహా చేశారని స్వపక్ష సభ్యులపై ఆగ్రహంతో ఊగిపోయారు. పార్టీ మండల కమిటీ సమావేశంలోనే ఓటమికి మీరే కారణమంటూ ఏకంగా త్రిపురారం మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డిపై చేయి చేసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నివేదితా రెడ్డి ఓటమికి గల కారణాలను విశ్లేషించేందుకు శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యలయంలో త్రిపురారం మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమాచావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డితో పాటు నివేదితారెడ్డి కూడా హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ఖర్చు నిమిత్తం ఇచ్చిన రూ.15లక్షలు ఓటర్లకు పంపిణీ చేయకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపించారు. ఈ క్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. కాజేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మధ్య మాటామటా పెరిగిపోయింది. తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన శ్రీధర్‌రెడ్డి సమావేశంలోనే మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిపై చేయిచేసుకున్నారు. అడ్డువచ్చిన పార్టీ కంపాలపల్లి బూత్ అధ్యక్షుడు శివనేని దశరథను కూడా నెట్టివేసి కులం పేరుతో దూషించాడని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పార్టీ నాయకులు వారిని సముదాయించడంతో శ్రీధర్‌రెడ్డి, నివేదితారెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు కార్యకర్తలతో కలిసి శ్రీధర్‌రెడ్డి తనపై దాడి చేశాడని త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై రాత్రి వరకు కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.


కులం పేరుతో దూషిస్తూ దాడి చేశాడు


అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఓటమికి గల కారణాలు విశ్లేషించేందుకు త్రిపురారంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశానికి హాజరయ్యా. డబ్బుల విషయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మండల అధ్యక్షుడికి వాగ్వాదం జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఆగ్రహంతో ఊగిపోతూ వచ్చి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి గొంతు పట్టుకుని చేయి చేసుకున్నాడు. అడ్డుగా పోయిన నన్ను కూడా జిల్లా అధ్యక్షుడు నెట్టివేసి కులం పేరుతో దూషించాడు.

– శివనేని దశరథ, బీజేపీ బూత్ అధ్యక్షుడు, కంపాలపల్లి

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- కొట్టంలో నిద్రించి తెల్లారేసరికి విగతజీవిగా..
- కుటుంబ కలహాలతో భర్తకు దూరంగా ఉంటున్న వివాహిత
- త్రిపురారం మండలం బాబుసాయి పేటలో ఘటన


స్వాతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటగిరి, సీఐ గాంధీ


స్వాతి (ఫైల్)

త్రిపురారం : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతిచెందింది. ఈ ఘటన త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాబుసాయిపేట గ్రామానికి చెందిన కొండమీది సైదయ్య, వెంకటమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు, కుమారుడు సంతానం. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి నాలుగో కుమార్తె స్వాతికి నిడమనూరు మండలం ఇండ్లకొటయ్యగూడెం గ్రామానికి చెందిన వ్యక్తితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి కాపురంలో కలతలు రావడంతో స్వాతి రెండేళ్ల క్రితం పుట్టింటికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ ఇక్కడే జీవనం సాగిస్తోంది.

ఉలుకూపలుకు లేకుండా..

గ్రామానికి చెందిన సైదయ్య, వెంకటమ్మలది నిరుపేద కుటుంబం. కూలి పనులకు వెళ్తేనే పూట గడుస్తుంది. ఇందులో భాగంగా తల్లిదండ్రులతో పాటు స్వాతి కూడా గురువారం కూలికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. భోజనం చేశాక తల్లిదండ్రులు పూరిపాకలో పడుకోగా స్వాతి పక్కనే ఉన్న మేకల కొట్టంలో మంచంపై నిద్రించింది. శుక్రవారం తెల్లవారిన తర్వాత సైదయ్య, వెంకటమ్మలు మేకల కొట్టం వద్దకు రాగా స్వాతి ఉలుకూపలుకు లేకుండా కనిపించింది. దీంతో వారు లబోదిబోమనడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే స్వాతి విగతజీవురాలైంది.

ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, హాలియా సీఐ గాంధీ, త్రిపురారం ఎస్‌ఐ వీరశేఖర్, ఏఎస్‌ఐ రామయ్య తదితరులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. స్వాతి మృతిపై తల్లిదండ్రులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తమ కుమార్తె మరణంపై అనుమానం ఉందని మృతురాలి తండ్రి సైదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపారు.

ఆయన ఎవరు..?

స్వాతి గురువారం రాత్రి 9గంటల సమయంలో మేకల కొట్టంలో నిద్రపోయింది. అర్ధరాత్రి దాటిన తర్వాత కొట్టంలో అలజడి అయినట్లు గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అలజడికి నిద్రలేచిన తల్లిదండ్రులు ఎవరని స్వాతిని ప్రశ్నించగా ఆయనొచ్చాడు అంటూ బదులిచ్చినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత స్వాతి వద్దకు వచ్చిన వ్యక్తి ఎవరనేది తేలితేనే కేసు చిక్కుముడి వీడుతుందని తెలుస్తోంది. కేసును పలు కోణాల్లో లోతుగా విచారణ జరుపుతున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత ఓ అంచనాకు రానున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

అయోధ్య రామాలయ అక్షింతల ఊరేగింపు



అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో శుక్రవారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను భక్తులు ఊరేగించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గోదాదేవికి విశేష పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం 14వ రోజు గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అలాగే మహిళలు మంగళహారతులతో తరలివచ్చి పూజలు జరిపి కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

చెవిటి వెంకన్నకు ఎంపీ టికెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న ఆవుల రామ్మూర్తి

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు కేటాయించాలని యాదవ సంఘం జిల్లా నాయకుడు ఆవుల రామ్మూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి చెవిటి వెంకన్నయాదవ్‌కు టికెట్ కేటాయించాలని కోరారు. వెంకన్న యాదవ్‌కు టికెట్‌ను ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు కోడి కుమార్‌యాదవ్, పశుల అశోక్ యాదవ్, సైదులు, వెంకన్న, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం పరిశీలన



శిబిరం వద్ద బీపీ పరీక్ష చేయించుకుంటున్న డీపీఓ రామారావునాయక్

అర్వపల్లి : మండల పరిధిలోని లోయపల్లిలో శుక్రవారం ప్రజా పాలన గ్రామసభ సందర్భంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని డీపీఓ, మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరం వద్ద ఆయన బీపీ పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎల్.చరణ్, ఏఎన్ఎం విజయశాంతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌కు ఎంపీ లింగయ్యయాదవ్ పరామర్శ



సురేష్‌ను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్, నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్ గ్రామంలో కాంగ్రెస్ శ్రేణుల దాడిలో గాయపడి సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు మెండె సురేష్‌ను శుక్రవారం ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా రైతు బంధు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని సురేష్ ప్రశ్నించడంతోనే కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని, సురేష్‌పై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. సురేష్‌తో పాటు అతడి భార్యాపిల్లలపై కూడా దాడిచేయడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఘర్షణలు జరగకపోవడంతో ప్రజలు ప్రశాంతంగా జీవించారని అన్నారు. ఆయన వెంట బొడ్డు రామలింగయ్యయాదవ్, వేముల గణేష్, మచ్చ మధు, నున్న గిరి తదితరులు ఉన్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

- ప్రధాన కూడళ్లలో పనిచేయని సీసీ కెమెరాలు
- పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు
- పట్టించుకోని పోలీసులు, అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఒక్కో సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమంటూ పోలీస్ అధికారులు చెబుతుంటారు. దీంతో పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా వాటి నిర్వహణ బాధ్యతను మరుస్తుండడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించినా అంతే స్థాయిలో నిర్వహణ లేకపోవడంతో ఇప్పుడు పోలీసులకు ఇబ్బందిగా మారుతుంది. తిరుమలగిరి పట్టణంలోని స్థానిక చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే మందుల సామేల్ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చింపి వేశారు. ఈ కేసును ఛేదించేందుకు ఎదురుగా ఉన్న సీసీ కెమెరాలను తనిఖీ చేయగా అవి పనిచేయని పరిస్థితి నెలకొంది.

పట్టుబట్టి కెమెరాలు ఏర్పాటు..

నేరాలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించింది. ఇందులో భాగంగా 2018లో అప్పటి ఎస్ఐ మహేష్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజా ప్రతినిధులు, దాతలు, వ్యాపారులు, ఇతర సంస్థల సహకారంతో తిరుమలగిరి ఎక్స్‌రోడ్డుతో పాటు సూర్యాపేట, జనగామ,



తిరుమలగిరి ఎక్స్‌రోడ్డులో పనిచేయని సీసీ కెమెరాలు

తొర్రూరు, మోత్కూరు ప్రధాన రహదారుల వెంట గ్రామ చివరి ప్రాంతాల్లో 36సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్ నుంచి అనుసంధానం చేసి నిరంతరం వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. మొదట్లో బాగా పనిచేసినా మరమ్మతులే సమస్యగా మారింది. సీసీ కెమెరాల నిర్వహణను తరువాత వచ్చిన అధికారులు పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నేడు అలంకారప్రాయంగా మారాయి. పట్టించుకోవాల్సిన పోలీసులు వాటిపై దృష్టి సారించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

అసాంఘిక, చోరీలపై నిఘా కరువు..

గతంలో సీసీ కెమెరాలు పనిచేస్తున్న సమయాల్లో అప్పట్లో జరిగిన పలు చోరీ కేసుల్లో నిందితులను రోడ్డు ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడ్డాయి. సూర్యా



తిరుమలగిరిలోని చౌరస్తా

పేట జిల్లాకు చివరి ప్రాంతంగా తిరుమలగిరి ఉండటంతో పాటు జనగామ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ప్రతిరోజు వందలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో ఏదైనా రోడ్డు ప్రమాదం, హత్య, చోరీలు తదితర ఘటనలు జరిగితే బాధితుల, నిందితుల ఫొటోలు సీసీ పుటేజీల్లో నిక్షిప్తమయ్యేవి. దీంతో నిందితులను సకాలంలో గుర్తించేందుకు ఉపయోగపడేవి. కాని అవి ఇప్పుడు పనిచేయకపోవడంతో గుర్తించాలంటే పోలీసులకు తలనొప్పిగా మారింది. ఈ ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా, కలప, గంజాయి, పశువుల రవాణా, ప్రభుత్వ బియ్యం, దొంగతనాలు, వాహనాల చోరీ ఈ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీస్‌లు, అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



పట్టణంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారస్తులతో, రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖుల నుంచి నిధులు సేకరించి చేసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ లేకపోవడంతో పనిచేయడం లేదు. పోలీసులు వెంటనే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి.

– శ్రీనివాస్‌గౌడ్, ఎవరెస్ట్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తిరుమలగిరి

కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వివిధ వర్గాల నుంచి రూ.లక్షలు వసూలు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాని వాటి నిర్వహణ పట్టించుకోవడం వదిలేశారు. చిన్నచిన్న మరమ్మతులు వస్తే కూడా వాటిని పట్టించుకోవడం లేదు. సీసీ కెమెరాలు లేకపోవడంతో పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా కొత్త కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– అబ్బాస్, మామిడాల

ఆదరణ చూసి ఓర్వలేకనే అక్రమ కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రాజ్

అర్వపల్లి : ఆరాధ్య ఫౌండేషన్ చేస్తున్న సేవలతో ఫౌండేషన్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కొంతమంది రాజకీయ నాయకులు, పోలీస్ శాఖలోని అధికారులతో కుమ్మక్కై కుట్రపూరితంగా తనను అక్రమ కేసుల్లో ఇరికించారని ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ అన్నారు. శుక్రవారం అర్వపల్లిలో నిర్వహించిన ఫౌండేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో తాను కొనుగోలు చేసిన 17గుంటల భూమి విషయంలో తనను మోసం చేసిన మధ్యవర్తి అయిన గ్రామ సర్పంచ్‌ను నిలదీశానని, దీంతో ఆ సర్పంచ్ తన బంధువైన రాష్ట్ర మాజీ మంత్రి పీఏ, పోలీస్‌శాఖలో ఉన్నతాధికారి, తుంగతుర్తి నియోజకవర్గంలో కొంతమంది నాయకులతో కలిసి అక్రమంగా తనపై కేసులు బనాయించి జైలుకు పంపారని వెల్లడించారు. తనకు ఇంతవరకు మద్యం సేవించే అలవాటు లేదని, కాని నిత్యం మద్యం సేవించి తిరుగుతానని పోలీసులు తప్పుడు కేసు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు తాను 3వేల మంది పేద పిల్లలకు చదువుల కోసం ఫీజులు కట్టానని, 4వేల మందికి తన సొంత ఖర్చులతో ఉచితంగా పోస్టల్ బీమా చేయించానని తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 20వేల మందికి పైగానే పేదలకు సాయమందించినట్లు తెలిపారు. తనపై పన్నుతున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తాను తప్పులు చేసినట్లు నిరూపిస్తే తుంగతుర్తి నియోజకవర్గంలో అడుగుపెట్టనని అన్నారు. సమావేశంలో ఫౌండేషన్ ఉమ్మడి జిల్లాలోని అధ్యక్షులు టి.ఆచారి, గనగాని నర్సింహ, గజ్జి రవి, ఎ.లక్ష్మణాచారి, వీరేందర్, జయపాల్‌నాయక్, వెంకటాచారి, నర్సింగ వెంకటేశ్వర్లు, కొమ్ము విజయ్, డాక్టర్ లక్ష్మణ్, కొమ్ము లింగస్వామి, అంబటి రాములు, అభిలాష్, దుర్గయ్య, భద్రి, ప్రసన్న, కరుణకుమార్, నాగేంద్రాచారి, జలేందర్, నరహరి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించాలి



దరఖాస్తుపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు పథకాలు ప్రతి పేదవారికి అందించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం పట్టణంలోని 22వ వార్డులో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వార్డు సభ్యులకు ప్రజా పాలన దరఖాస్తు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలతో ప్రతి పేదవాడికి స్థితిగతులు మారుతాయన్నారు. ప్రజలు నేరుగా అధికారులను సంప్రదించి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఆరు రోజులు పాటు జరిగే వార్డు సభలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తుల గడువు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, 22వార్డు కార్యదర్శి పెండ్ర కృష్ణ, బూర మురళి, వాడపల్లి వెంకన్న, వాడపల్లి గోపి, పెండ్రాల వెంకన్న, పెండ్ర రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఘనంగా లక్ష కుంకుమార్చన

భానుపురి (సూర్యాపేట) : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకమైన పట్టువస్త్రాలు, వివిధ రకాల ఆభరణములతో అమ్మవారిని అలంకరించి మండపంలో అధిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. పూజ అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బజ్జూరి కృష్ణయ్య, గజ్జల రవీందర్, నాగరాజు, శేఖర్, మంజుల, అరుణమ్మ, విజయ, వనజ, అరుణ, పద్మ, వికాస తరంగిణి, ఆండాళ్ గోష్ఠి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చన పూజలకు హాజరైన భక్తులు

ఆరుతడికే 'ఎస్సారెస్పీ' నీరు

- ఇప్పటికే వరిసాగుకు నారు సిద్ధం చేసుకున్న ఆయకట్టు రైతాంగం
- ఆందోళనలో అన్నదాతలు

అర్వపల్లి/ఆత్మకూరు (ఎస్) : ప్రస్తుత యాసంగి సీజన్‌కు గాను వరి పంటలకు గోదావరి జలాలు ఇవ్వలేమని ఎస్సారెస్పీ అధికారులు తేల్చేశారు. ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఇప్పటికే రైతులు గతంలో మాదిరిగానే గోదావరి జలాలు పూర్తి స్థాయిలో వస్తాయనే ఆశతో పెద్దఎత్తున వరినార్లు పోశారు. ప్రతి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ఎస్సారెస్పీ కింద సుమారు 2.40 లక్షల ఎకరాలుసాగులోకి రానుంది.

జనవరి 8న గోదావరి జలాల రాక..

జిల్లాకు గోదావరి జలాలు జనవరి 8న చేరనున్నాయి. మొత్తం ఆరు వారాల పాటు జిల్లాకు వారబందీ విధానంలో మార్చి 30 వరకు నీళ్ల రానున్నాయి. జిల్లాలోని 69, 70, 71 డిస్ట్రిబ్యూటరీలకు అవసరమైన మేర నీటిని గతంలో వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉన్నందున కొద్ది పాటి నీటిని మాత్రమే వదలాలని ఆశాఖ అధికారులు నిర్ణయించారు. కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయమై నీటిపారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్‌ను ప్రశ్నించగా వచ్చే నెల 8వరకు జిల్లాకు గోదావరి జలాలు రానున్నాయని, ఈ సీజన్‌లో వరి పంటలకు నీళ్లు ఇవ్వడం కష్టమని ఆరుతడి పంటలను రైతులు సాగుచేసుకోవాలని సూచించారు.

ఆత్మకూరు (ఎం) మండలంలోని రైతాంగం సాగు



ఆత్మకూర్‌లో ఎస్సారెస్పీ ఆయకట్టులో నాటు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరినారు

నీటి కొరతతో ఆందోళన చెందుతున్నారు. బోరు బావుల కింద వరినాట్లు ముమ్మరంగా సాగుతుండగా.. ఎస్సారెస్పీ ఆయకట్టు రైతాంగం సాగునీటి కోసం వెయ్యి కనులతో ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ఆరుతడి పంటలకు మాత్రమే నీటి విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. మండల పరిధిలోని ఎస్సారెస్పీ ఆయకట్టుకు జనవరి 8నుంచి ప్రభుత్వం నీటిని విడుదల చేయనుంది. అయితే గతంలో మాదిరిగా వరిపంటకు కాకుండా ఆరుతడి పంటలకే నీరు ఇవ్వనున్నారు.

నాలుగేళ్ల క్రితం వరకు వరిసాగు అంతంతే..

నాలుగేళ్ల క్రితం వరకు మండలంలో వరిసాగు అంతంత మాత్రంగానే ఉండేది. అయితే గోదావరి జలాలు రావడంతో పత్తి సాగు చేసిన రైతులంతా వరిసాగు వైపు మొగ్గుచూపారు. ఈ యాసంగి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి సాగు చేసేందుకు గాను నారు కూడా సిద్ధం చేసుకున్న రైతులు ఎకరం ఉన్న రైతు నారుమడి, వరి విత్తనాల కోసం రూ.2వేల వరకు ఖర్చు చేశాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నాగారం : అక్రమంగా తరలిస్తున్న 33క్వింటాల పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని వర్ధమానుకోట గ్రామ శివారులో పట్టుకొని సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ఐ సైదులుగౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీబీనగర్ మండలం జంపల్లి గ్రామం, చందునాయక్ తండాకు చెందిన దేవసోత్ శ్రీకాంత్ అదే తండాకు చెందిన రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న దేవసోత్ రెడ్యా బోలేరో వాహనంతో వర్ధమానుకోటలోని ఓ ఇంట్లో నిలువ చేసిన సుమారు 33క్వింటాల రేషన్ బియ్యాన్ని బీబీనగర్‌కు తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో తరలిస్తున్న బియ్యాన్ని గ్రామశివారులో పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం, బోలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఎల్లయ్య, లింగయ్య, వీరునాయక్ తదితరులు ఉన్నారు.

కేసులు నమోదు

అర్వపల్లి : మండలంలోని కాసర్లపహాడ్ గ్రామంలో గురువారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.అంజిరెడ్డి శుక్రవారం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిపై గ్రామ బీఆర్ఎస్ నాయకుడు మెండె సురేష్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని ఈ కేసులో గెగుళ్ల శ్రవణ్‌తో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే సురేష్‌పై సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రభుత్వంపై తప్పుడు పోస్టులు పెడుతున్నాడని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయగా అతడిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని అభయహస్తం గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరవ చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం ప్రజా పాలనను చేపట్టిందన్నారు. నియోజకవర్గ ప్రజలు తాను అనునిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పేదోడికైన ఇళ్లు ఇచ్చిందా అని ప్రశ్నించారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నాగారంలో మిషన్‌భగీరథ నీరు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా ఆయన వెంటనే స్పందించి వారం రోజుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని మిషన్‌భగీరథ డీఈఈకి ఫోన్‌లో సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ గాలి శోభారాణి, పీఆర్ డీఈఈ కొండయ్య, ఎంఈఓ బి.బాలునాయక్, ఎంపీపీ కూరం మణివెంకన్న, సర్పంచ్ చిప్పలపల్లి స్వప్న, ఉపసర్పంచ్ భద్రయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చందన, విద్యుత్ ఏఈఈ మహేంద్రకుమార్, డీటీ షాహిన్ బేగం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పాశం యాదవరెడ్డి, కన్నెబోయిన వెంటకభిక్షం, కడారి సోమయ్య, పానుగంటి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఆర్డీఆర్

చివ్వెంల : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోదిన్‌పురం, తిమ్మాపురం, జయరాంగుడితండా, పిల్లల జెగ్గుతండాలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఆరు గ్యారంటీలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ ఎల్.లక్ష్మి, ఎంపీఓ గోపి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన

పెన్‌పహాడ్ : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు పాలన చేరువైందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే రెండు గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నామని, మిగతా పథకాల అమలు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తుల స్వీకరణ కేంద్రం వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, ఉపసర్పంచ్ యగ్గడి పద్మ, ముత్తినేని శ్రీనివాస్, నకిరేకంటి వెంకన్న పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందజేత

అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి రాంపతి, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్‌లు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి, నాగులపాటి అన్నారం, నారాయణగూడెం, నాగులపహాడ్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమాల్లో డీఎంహెచ్ఓ కోటాచలం, రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ వెంకన్నగౌడ్, సర్పంచ్‌లు మీసాల రమణ, ధనియాకుల కోటమ్మ, మండలి మల్లయ్య, రాయిలి లక్ష్మి, ప్రత్యేక అధికారి రమేష్, ఏఓ కృష్ణ సందీప్, ఎంపీఓ నరేష్, ఏపీఎం అజయ్‌నాయక్, ఏపీఓ రవి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజా పాలన గ్రామసభలు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని ఠోక్యా నాయక్‌తండా, రాఘవపురం, మర్రికుంటతండా గ్రామాల్లో శుక్రవారం ప్రజా పాలనపై గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, మండల పంచాయతీ అధికారి మారయ్య, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, సూపర్‌వైజర్ ఖైరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ప్రజలకు పాలనను చేర వేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందని తిరుమలగిరి మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ బత్తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం 4వ వార్డులో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, సుంకరి జనార్దన్, రాపాక సోమేష్, కందుకూరి లక్ష్మయ్య, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది రాములు, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి : ప్రజా పాలనను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బీంసింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సూర్యతండా, రామన్నగూడెంతండా, మంచ్యాతండా, రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారికి రశీదులను అందజేసి మాట్లాడారు. నేడు మండలంలోని కేశవపురం, ఏనేకుంటతండా, కర్విరాల, మానపురం గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, సర్పంచ్‌లు యాకు నాయక్, కాంతమ్మ, శారద, వెంకన్న, ఎంపీటీసీ నరేష్, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

అర్వపల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకానికి ప్రజా పాలన గ్రామసభల్లో అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. శుక్రవారం మండలంలోని కుంచమర్తిలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డీఈఈ పిచ్చయ్య, సర్పంచ్‌లు ఉగ్గం ఉపేంద్రలింగరాజు, శాంతమ్మ, ఎంపీఓ సందీప్‌కుమార్, డీటీ కంఠ్లమయ్య, సీనియర్ అసిస్టెంట్ జలెంధర్‌రావు, ఏఈ అశోక్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రజా పాలనను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోలుమల్ల, గోరెంట్ల గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తుదలు స్వీకరించారు. నేడు జి.కొత్తపల్లి, మామిండ్లమడవ, తూర్పుతండా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, ఏఓ వికాస్ పాటిల్, విద్యుత్ ఏఈ మేఘన, ఎంపీఓ రాజేష్, సర్పంచ్ దామెర్ల వెంకన్న, శిలివేరు భవానీలింగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా ప్రజా పాలన గ్రామసభలు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. మండలంలోని మంగలితండా, పీపానాయక్ తండా, రామోజీ తండా, ఏపూర్ తండాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఏపూర్ తండాలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలను జెడ్పీ సీఈఓ సురేష్ సందర్శించి పరిశీలించారు. అనంతరం దరఖాస్తు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారులు వెంకట్‌రెడ్డి, నాగేంద్రశర్మ, ఎంపీడీఓ మల్హార్‌నాయక్, తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, ఎంపీఓ సంజీవ, ఏఓ దివ్య, సర్పంచులు నాగరాజు, నర్సింహ, గుగులోతు శారద జగపతి పాల్గొన్నారు.



నాగారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్



పెన్‌పహాడ్ : దరఖాస్తు స్వీకరిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, అధికారులు



ఆత్మకూర్ (ఎస్ : ఏపూరుతండాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సురేష్



మద్దిరాల : పోలుమల్లలో ప్రజా పాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సైదులు



తిరుమలగిరిలోని 4వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



తుంగతుర్తి : సూర్యతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ బీంసింగ్



అర్వపల్లి : కుంచమర్తిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ రేణుక, అధికారులు